సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 21 । జూలై । 2025



మళ్లీ మొదలెట్టారు..!

ఒడిశాకు అక్రమ ఇసుక తరలి వెళ్తోంది. అధికారులు దృష్టి పెట్టడం లేదు.

- 8లో



అదరగొట్టిన కుర్రాడు

అంతరకుడ్డ కుర్రాడ అదరగొట్టాడు. వాలీబాల్ పోటీల్లో అత్యున్నతంగా రాణిస్తున్నాడు.

- 8లో

ఏంబీఏలో వెబ్ ఆప్షన్‌కు అవకాశం

రణస్థలం: బీఆర్ఏయూలోని ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి సోమవారమే ఆఖరి తేదీ అని రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత తెలిపారు. ఐసెట్–2025లో ఉత్తీర్ణత చెందిన వారు ఐసీఈటీ–ఎస్‌సీహెచ్‌ఈ.ఏపీటీ ఆన్‌లైన్.ఇన్ ద్వారా ఆప్షన్ ఇచ్చుకోవచ్చునని సూచించారు. డాక్టర్ బీఆర్ఏయూలో 44 రెగ్యులర్, 11 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు గల ఎంబీఏ కోర్సుకు ప్రభుత్వం నుంచే వచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని, వర్సిటీలో హాస్టల్ వసతి ఉంటుందని రిజిస్ట్రార్ తెలిపారు.

న్యూస్‌రీల్

శాకంబరిగా నీలమణిదుర్గ



పాతపట్నం: పాతపట్నంలోని ఉన్న శ్రీనీలమణిదుర్గ అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరిదేవిగా ఆదివారం అలంకరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, 700 కేజీల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని ఆలంకరించారు.

చంద్రబాబు అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్దాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తూ, అక్రమ అరెస్టులు, వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు చేయిస్తున్న చంద్రబాబు అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి నాలుగో స్థాయిలో పంచాయతీల్లో కార్యక్రమాలు జరగనున్నాయని వీటిల్లో కార్యకర్తలు, నాయకులు చురుకుగా పాల్గొని చంద్రబాబు మోసాలు ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటి వరకూ జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల్లో కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ఈ మూడు స్థాయిల్లో కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా విజయవంతం అయ్యాయని తెలిపారు. సోమవారం నుంచి జూలై ఐదో తేదీలోగా పంచాయతీ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఏకగ్రీవంగా జిల్లా వీఆర్వోల సంఘం కార్యవర్గ ఎన్నిక



వీఆర్వోల నూతన కార్యవర్గం

టెక్కలి/ నరసన్నపేట: జిల్లా వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారెళ్ల అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షునిగా ప్రగడ వేణుగోపాల్‌ను ఎన్నుకున్నామని తెలిపారు. ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న రమేష్‌కుమార్ మన్యం జిల్లాకు బదిలీపై వెళ్లడంతో నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు ఆదివారం ఎన్నుకున్నామని తెలిపారు. జిల్లా కార్యదర్శిగా శ్రావణ్, ట్రెజరర్‌గా కేకే ప్రసాద్, ఉపాధ్యక్షులు పి.తిరుపతిరావు, ఈసీ సభ్యులుగా ఎస్.రామారావు, జాయింట్ కార్యదర్శులుగా కృష్ణంరాజు, ఇందిర ప్రియదర్శిని, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సభ్యునిగా బీవీఆర్ విశ్వేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులుగా ఇజాజ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సంఘానికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలొద్దు

సాక్షి, విశాఖపట్నం : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో ఎలాంటి అపోహలు అవసరం లేదని, వీటితో వినియోగదారులపై అదనపు భారం ఉండే అవకాశమే లేదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల ప్రక్రియ విషయంలో వస్తున్న వదంతులపై ఆయన స్పందిస్తూ.. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతోందని పేర్కొన్నారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు ప్రస్తుతం వీటిని అమర్చుతున్నామన్నారు. వీటితోపాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వాల్యూ) గృహ వినియోగదారులకు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏర్పాటు సమయంలవాటి ఖరీదు, చార్జీలు చెల్లించనక్కర్లేదన్నారు.

ఇసుకాసురుల కండకావరం



పాతనిమ్మతొర్లువాడలో అలజడి

ఇసుకాసురులు ఏరు వదిలి ఊరి మీద పడ్డారు. ఇసుక తవ్వకం వద్దు అన్నందుకు గ్రామస్తులను చావబాదారు. ఆ గ్రామంలోని నది వద్దకు వెళ్లి, అక్కడి ఇసుక తీసుకెళ్లి అమ్ముకుంటూ తిరిగి అదే గ్రామస్తులపై దాడికి తెగబడ్డారు. ఆమదాలవలస మండలం పాత నిమ్మ తొర్లువాడలో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన దిగ్భ్రాంతి కలిగించింది. ఇసుక తవ్వకాల వల్ల తమకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఉదయం ఆందోళన చేస్తే.. వంద మందితో రాత్రిపూట ఊరి మీద పడి దాడి చేయడం కలకలం రేపుతోంది.



భయాందోళనలో గ్రామస్తులు

- ఇసుక ర్యాంపు వద్దు అన్నందుకు పాత నిమ్మ తొర్లువాడ గ్రామస్తులపై దాడి
- ర్యాంపు నిర్వాహకులే దాడి చేయించారంటున్న గ్రామస్తులు
- ఇనుప రాడ్లు, కర్రలతో దాడి
- పోలీసుల సమక్షంలోనే కొట్టినా పట్టించుకోని వైనం



దాడిలో తగిలిన గాయాలు

ఆమదాలవలస:

ఆమదాలవలస మండలం నిమ్మ తొర్లువాడలో ఇసుక వ్యాపారులు రెచ్చిపోయారు. ఇక్కడ నాగావళి తీరంలో జేసీబీలతో పెద్ద పెద్ద గోతులు చేస్తూ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. వేల సంఖ్యలో లారీలతో ఇసుకను తరలిస్తూ ఉంటే తమ గ్రామానికి ముప్పు కలుగుతుందని పాత నిమ్మ తొర్లువాడ గ్రామస్తులు ఆదివారం ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమదాలవలస ఎస్ఐ ఎస్.బాలరాజుతోపాటు కొంతమంది పోలీసులు ఆ గ్రామానికి చేరుకుని స్థానికులతో చర్చించారు. ఇసుక ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడుతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇంతలోగా సాయంత్రం కావడంతో ఇసుక ర్యాంపు నిర్వాహకులు సమీప గ్రామాల్లో ఉన్న కొంతమంది రౌడీలను ఉసిగొల్పి ర్యాంపును అడ్డుకున్న వారిపై రాత్రి దాడి చేయించారు. ఇనుప రాడ్లు, కర్రలతో దాదాపు వంద మంది ఊరి మీద పడ్డారు. ఈ దాడిలో పాత నిమ్మ తొర్లువాడ గ్రామానికి చెందిన వండాన వైకుంఠరావు, ఇప్పిలి రాజేష్, బోనెల ఈశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తూ, గ్రామాలపై దాడులు చేస్తున్న వారిని ఆమదాలవలస పోలీసులు చూసీచూడనట్టు వదిలేయడంపై పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



పాత నిమ్మతొర్లువాడ గ్రామంలో నాగావళి తీరంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

బదిలీలు సరే.. జీతాలు వెయ్యరే..?

- టీచర్లకు పొజిషన్ ఐడీలు కేటాయించడంలో ప్రభుత్వ అలసత్వం
- జూన్ నెల జీతం రాలేదు, జూలై జీతం కూడా కష్టమేనని దిగులు
- పట్టించుకోని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు



శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యాశాఖలో జరిగిన బదిలీల్లో స్థానచలనం కలిగిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. వారికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకుండా అవస్థల పాలు చేస్తోంది. బదిలీలను సాకుగా చూపి జీతాలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి విద్యాశాఖను గాలికొదిలేశారని అంటున్నారు.

జిల్లాలో 4వేల మందికిపైనే..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో మొత్తం 6392 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 3546 మందికి బదిలీలు చేశారు. మరో 124 మందికి పదోన్నతులు కల్పించారు. గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు 107 మందికి, మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా 118 మందికి, స్కూల్ అసిస్టెంట్, సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులుగా 1217 మందికి, సెకండరీ గ్రేడ్, సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులుగా 1962 మందికి, లాంగ్వేజ్ పండితులు 142 మంది ఉన్నారు. వీరిలో రీ అపోర్షన్ పోస్టుల్లో చేరిన 1521 మంది టీచర్లతోపాటు, రేషనలైజేషన్ కారణంగా కొన్ని పోస్టుల ఏ ర్పాటు, నూతనంగా ఏర్పడిన వివిధ పోస్టులు, మోడల్ ప్రైమరీ హెచ్ఎం పోస్టులు, ఆ హెచ్ఎం పరిధిలో పనిచేస్తున్న టీచర్లకు ఇలా.. వివిధ టెక్నికల్ సమస్యలతో మరో 3వేల మంది వరకు ఉపాధ్యాయుల జీతాలు విడుదల కాలేదు.

గాలికొదిలేసిన మంత్రి

సాధారణంగా జూన్, జూలై నెలల్లో ప్రతి కుటుంబంలో ఖర్చులు చాలా ఎక్కువగా ఉంటాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లల స్కూల్ ఫీజులు, విద్యాసామగ్రి కోసం వేలల్లో వెచ్చించాల్సి ఉంటుంది. అలాగే బదిలీ జరిగిన ప్రాంతానికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు, కొత్త ఇంటి అడ్వాన్సులు, ఇంటి అద్దెలు రూపంలో మరింత ఖర్చు పెరుగుతుంది. ఇంట్లో వ్యవసాయం ఉంటే విత్తనాలు, ఎరువులు, దుక్కులకు చాలా ఖర్చులు చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికితోడు జీతాలు రాక పోవడంతో మంత్లీ ఈఎంఐల చెక్కు బౌన్సులు, పర్సనల్ లోన్, హౌసింగ్ లోన్ వంటి చెక్ బౌన్సులు అవుతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వ బదిలీల కారణంగా ఉపాధ్యాయుల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. చొరవ తీసుకుని అధికారులను అప్ర మత్తం చేసి న్యాయం చేయాల్సిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కనీస జాడ కనిపించడం లేదని వారు వాపోతున్నారు. తమశాఖకు చెందిన అధికారులే తమని పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొజిషన్ ఐడీలు ఎక్కడ..?

సాధారణంగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓకు సమాచారం అందిస్తారు. ఇందు కోసం ఉద్యోగులకు పొజిషన్ ఐడీలు కేటాయించాలి. ఈ తతంగాన్ని ప్రభుత్వమే దగ్గరుండి పూర్తిచేయాలి. గత నెల 15వ తేదీవ లోపల అన్ని క్యాడర్ల ఉపాధ్యాయుల బదిలీలను ప్రభుత్వం పూర్తి చేసింది. ఇది జరిగి నెలరోజులు దాటిపోయింది. ఇప్పటికీ ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. దీంతో జూన్ నెలకు సంబంధించి జూలైలో రావాల్సిన జీతాలు ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు అందలేదు. అలాగే జూలై నెలకు సంబంధించిన జీతాలు ఆగస్టు మొదటివారంలో అందుకునే అవకాశం కూడా ప్రస్తుత పరిస్థితుల్లో లేనట్టేనని గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రస్థాయిలో.. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా అతీగతీ లేదని సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



ఉపాధ్యాయుల బదిలీల్లో స్థానచలనం కలిగిన ఉపాధ్యాయులకు ఇంకా జీతాలు అందలేదు. తీవ్ర జాప్యానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. తక్షణమే ప్రభుత్వం స్పందించి పొజిషన్ ఐడీలు జారీచేసి ఉపాధ్యాయులకు త్వరితగతిన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

– దుప్పల శివరాంప్రసాద్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

డీఫాల్టర్లు అవుతున్నారు



ఉపాధ్యాయుల జీవితాలతో ఆటలాడుకోవడం మంచిది కాదు. జీతాలు లేని కారణంగా జిల్లాలో వేలాది ఉపాధ్యాయ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. జీతాలు రాక, ఈఎంఐలు కట్టలేక, చెక్ బౌన్సులు అవుతూ.. డీఫాల్టర్లు అవుతున్నారు. ఆగస్టు నెల జీతం కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు.

– ఎండ ఉమాశంకర్, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సెలర్

విద్యాశాఖను పట్టించుకున్న నాథుడే లేడు



రాష్ట్రంలో విద్యాశాఖను పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఇటు పాఠశాల విద్య, ఇంటర్‌విద్య, కాలేజియేట్ విద్య అంతా అస్తవ్యస్తంగానే ఉంది. సంబంధిత మంత్రి విద్యాశాఖమంత్రి తన శాఖను గాలికొదిలేశారు.

– మజ్జి మదన్‌మోహన్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయులకు జీతాలు అందేది ఎప్పుడు?

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వం మొద్దునిద్రను వీడి, విద్యాశాఖను పట్టించుకోవాలని, ఉపాధ్యాయులకు జీతాలు అందేవిధంగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) జిల్లా అధ్యక్షులు దుప్పల శివరాం ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆపస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో దుప్పల మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో స్థానచలమైన ఉపాధ్యాయులతోపాటు సాంకేతిక కారణాల వల్ల అనేక మంది ఉపాధ్యాయులకు ఇంకా జీతాలు అందలేదని తెలిపా రు. బదిలీల ప్రక్రియ జూన్ 15తో ముగిస్తే.. ఇప్పటి వరకు ఇటు ప్రభుత్వం గానీ, అటు అధికారులు గానీ టీచర్లను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. ఇంతటి తీవ్ర జాప్యానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పొజిషన్ ఐడీలు జారీ చేసి, ఉపాధ్యాయులకు త్వరితగతిన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే క్లస్టర్ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు ఉపాధ్యాయులకు జరుగుతున్న కాంప్లెక్స్‌లు ఉపయోగకరంగా లేవన్నారు.

ఇప్పటికీ స్టూడెంట్ కిట్, హ్యాండ్‌బుక్ రాలేదు..

ఇప్పటికీ అనేక పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్‌బుక్స్ రాలేదని, అలాగే టీచర్లకు హ్యాండ్‌బుక్స్ కూడా అందలేదని దుప్పల గుర్తుచేశారు. వాటిని త్వరితగతిన అందించేలా చూడాలన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అభివృద్ధిని విస్మరిస్తున్నారని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన ఆదివారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పాలనపై కాకుండా కక్ష సాధింపులపై దృష్టి పెడుతోందని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో రూ.2.50 లక్షల కోట్లను ఎలాంటి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందించామని గుర్తు చేశారు. లక్షన్నర పైచిలుకు సచివాలయ ఉద్యోగులతో పాటు నాలుగు లక్షల మంది వలంటీర్ల నియామకం జరిగిందన్నారు. ఉద్యోగ కల్పనలో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో నాటి వైఎస్ జగన్ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇప్పుడు సంక్షేమం కరువైపోయిందన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూడటం ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయ కక్షతో వేధిస్తున్నారని, వల్లభనేని వంశీ, పోసాని ఇలా ఒక్కొక్కరిని కక్షపూరితంగానే జైల్లో పెట్టారని తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కూడా వదలకుండా వేధిస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వం చేతకానితనాన్ని తేటతెల్లం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం గద్దెనెక్కిన ఏడాదికే రూ.1,80,000 కోట్లు అప్పు చేసిందన్నారు. దీనిపై లెక్కలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కారు చౌకగా ప్రభుత్వ భూములను కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేయటం మానుకోవాలని హితువు పలికారు. భారత రాజ్యాంగాన్ని విస్మరించి, రెడ్ బుక్ రాజ్యాంగం ప్రకారం పరిపాలన కొనసాగితే, ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి వస్తుందన్నారు. హత్యా రాజకీయాలను రూపుమాపాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు చిరంజీవినాగ్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు ఆదివారం కురిసిన వర్షాలకు పూర్తిగా జలమయమయ్యాయి. జీరుపాలెం, పాపారావుపేట వంటి గ్రామాలు నీట మునిగాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో బకెట్లతో నీటిను తోడుతున్నారు. - రణస్థలం

పాలనపై వ్యతిరేకత దాచేందుకే..



- సర్వేలో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపిస్తోంది
- అందుకే ఈ డైవర్షన్ రాజకీయాలు
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు అన్యాయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లోకి వెళ్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఛీత్కారాలు ఎదురవుతున్నాయని, అందుకే ఈ డైవర్షన్ పాలిటిక్స్‌కు చంద్రబాబు తెర తీశారని తెలిపారు. ఇటీవల మూడ్ ఆఫ్ ఏపీ పీపుల్ సర్వే రిపోర్టు ప్రకారం 98 మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నట్లు తేలిందన్నారు. ఇవి కప్పిపుచ్చే ప్రక్రియలో భాగంగానే మిథున్ రెడ్డి అరెస్టు జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వమే షాపులు నడిపిందని, ఇక స్కామ్ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. నిజానికి గత టీడీపీ కాలంలోనే పెద్ద స్కామ్ జరిగిందని ఆరోపించారు. 2014–19లో 4380 లిక్కర్ షాపులు ఉండేవని, అన్నీ ప్రైవేటువేనని తెలిపారు. అప్పట్లో రాష్ట్రంలో 40 వేల పైగా బెల్టుషాపులు ఉండేవని, వీటిన్నింటికీ మద్యం సేకరణ కోసం 20 డిస్టిలరీలు ఉంటే... కేవలం 5 డిస్టలరీలకే 70 శాతం మద్యం కొనుగోళ్లకు ఆర్డర్లు ఇచ్చేవారని ఇది స్కామ్ కాదా అని ప్రశ్నించారు.

ఒక స్టోరీని మసాలా వేసి దట్టించి వండి ఒక ప్రణాళిక ప్రకారం 2024 ఆగస్టు 26న టీడీపీ సానుభూతిపరుడితో ఫిర్యాదు చేయించారని గుర్తు చేశారు. 2019–24లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో లిక్కర్ షాపుల సంఖ్య తగ్గించామని, బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించామని తెలిపారు. అప్పట్లో 20 డిస్టిలరీలు ఉండేవని వీటిలో ఏ ఒక్క దానికి కూడా వైఎస్ జగన్ అనుమతులు ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇందులో 14 డిస్టలరీలు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనుమతి తెచ్చుకున్నవేనని తెలిపారు. కేసు, దర్యాప్తుల తీరుపై ఎల్లో మీడియాలో ఇష్టానుసారం రాస్తున్నారని, చంద్రబాబు చేస్తున్న ఈ రకమైన దుష్ట సంప్రదాయం అనేక పరిణామాలకు దారితీస్తుందన్నారు.

అన్నీ రెడ్‌బుక్‌లో భాగమే..

చార్జిషీట్‌లో ఏబీఎస్ బీసీ సెల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి స్టేట్‌మెంట్ ఉందని, స్టేట్‌మెంట్ ముందే తయారు చేసి దానిమీద సంతకం పెట్టమని తనను బలవంతం పెడుతున్నారని ఆయన హైకోర్టును ఆశ్రయించిన మాట వాస్తవం కాదా.? అని ప్రశ్నించారు. ఇదంతా లోకేష్ గొప్పగా చెప్పుకునే రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగానే జరుగుతోందన్నారు. ఇంత అరాచక పాలన దేశంలో ఎక్కడా ఉండదన్నారు.

రెడ్‌బుక్‌తో పరిశ్రమలు వెనక్కి..

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసే ప్రయత్నం చేయకుండా కంపెనీలకు భూములిచ్చే విషయంలో చాలా ఘోరాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో ఏ పరిశ్రమలు రాష్ట్రానికి రావడం లేదని, రెడ్‌బుక్‌తో పరిశ్రమలు వెనక్కి వెళ్తున్నాయని అన్నారు. తమకు అంబేడ్కర్ రాజ్యాంగంపైన, కోర్టులపైన నమ్మకం ఉందని తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు తమ నాయకుడిని సంతృప్తి చేయడానికి నాసిరకం మద్యం తాగి ట్వీట్ చేసినట్లుందన్నారు. మంత్రివర్గంలో త్వరలో మార్పులు జరిగితే అచ్చెన్నాయుడు పదవి పోతుందన్న వార్తలు వస్తున్న నేపథ్యలో ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాంటి చౌకబారు ట్వీట్లతో గౌరవం పోగొట్టుకోవద్దని హెచ్చరించారు.

ఆధారాలు లేకుండా కేసులు ఎలా పెడతారు..?

ఆధారాలు లేకుండా కేసులు ఎలా పెడతారు, అరెస్టులు ఎలా చేస్తారని పలాస కోర్టు మెజిస్ట్రేట్ సీఐను హెచ్చరించిందని సీదిరి తెలిపారు. ఇలాంటి సంఘటనలు రిపీట్ కాకుండా చూడాలని లేదంటే తగిన చర్యలు తీసుకుంటామని మెజిస్ట్రేట్ చెప్పిన తీరుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారని తెలిపారు.

రోడ్డుకు శంకుస్థాపన.. ట్రైసైకిళ్ల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్...

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి ఆంజనేయపురం గ్రామ రహదారి దుస్థితిపై ఈ నెల 11న 'సాక్షి'లో నరకానికి నకలు అనే వార్త ప్రచురితమైంది. అలాగే దివ్యాంగుల కోసం తీసుకువచ్చిన ట్రైసైకిళ్లు నెలల తరబడి టెక్కలి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పడి ఉండడంపై ఈ నెల 14న 'ఎందుకింత నిర్లక్ష్యం..?' అనే వార్త వచ్చింది. ఈ వార్తలకు మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. ఆయన ఆదివారం అంజనేయపురం గ్రామం రహదారి పనులకు శంకు స్థాపన చేశారు. అలాగే టెక్కలి ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. అంతే కాకుండా 'సాక్షి'లో వెలువడిన కథనాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ తో పాటు నాయకులు పాల్గొన్నారు.



టెక్కలి ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

క్లుప్తంగా

జోరువానలో పనులా?



వర్షంలోనే పనులు నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: రణస్థలంలో జరుగుతున్న ఫ్లై ఓవర్ పనుల్లో భాగంగా ఆదివారం ఓవైపు జోరుగా వర్షం పడుతున్నా పనులు కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో పనులు చేస్తే నాణ్యత లోపించి కాలువలు ఎక్కువ కాలం మన్నిక రాదని స్థానికులు చెబుతున్నారు. హైవే అధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎచ్చెర్ల : ఎస్ఎంపురం గ్రామ సమీపంలోని తోటల్లో పేకాట ఆడుతున్న 8 మందిని ఎచ్చెర్ల పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.21,130 నగదు, 7 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై-2 ఎం.అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మోహన్ ఆచార్య, సోమనాథ్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మందస: మందస మండల కేంద్రంలో శ్రీరాజా శ్రీనివాస స్మారక ఉన్నత పాఠశాల 125వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అన్ని బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు హాజరై ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. తోటి స్నేహితులను కలుసుకుని సందడి చేశారు. ఐకానిక్ భవన నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన మోహన్ ఆచార్యను సన్మానించారు. ప్రతి బ్యాచ్‌కు ప్రత్యేక షీల్డ్‌ను అందజేశారు.

విశ్రాంత డీఈఈ మృతికి సంతాపం



జి.సిగడాం: గతంలో వంశధార ప్రాజెక్టులో డీఈఈగా పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సువ్వారి జగదేశ్వరరావు(62) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన జి.సిగడాం మండలం వాండ్రంగి షిరిడీసాయి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. నీటిపారుదల శాఖలో ఏఈఈగా పని చేసిన అనంతరం వంశధార ప్రాజెక్ట్‌లో డీఈఈగా విధులు నిర్వహించి బదిలీపై పాయకరావుపేట వెళ్లారు. అక్కడ పని చేసి మార్చి 31న పదవీ విరమణ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఈలు డోల తిరుమలరావు, రవీంద్ర, మురళీకృష్ణ, వెంకటేశ్వరావు, సీఐ సింహాద్రినాయుడు, డీఈఈలు మన్మధరావు, రామ్మోహన్ , ఏఈఈలు, ప్రజాప్రతినిధులు బూరాడ వెంకటరమణ, సాకేటి నాగరాజు, కర్రి వైకుంఠేశ్వరరావు, గంటా అప్పారావు, రంగారావు, చిత్తిరి మోహన్‌లు నివాళులు అర్పించారు. వాండ్రంగిలో సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఐదో రోజైన ఆదివారం సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులకు జీవో 36 ప్రకారం రూ.26 వేలు వేతనాలు ఇవ్వాలని, కార్మికులందరికీ తల్లికి వందనం, ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు చేయాలని, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ -ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం, ఎ.శంకర్, యుగంధర్, ఎ.శేఖర్, ఎ.రాజశేఖర్, ఎ.జనా, డి.గణేష్, ఎ.లక్ష్మి, ఎస్.పార్వతి, ఆర్.ఈశ్వరమ్మ, ధనలక్ష్మి, పి.మల్లమ్మ, కె.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ మృతి

కాశీబుగ్గ: కోళ్లవ్యాన్‌ను అతివేగంతో వచ్చిన లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన పలాస సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పలాస మండలం గోదారిపురం గ్రామానికి చెందిన ఆసపాన దయాకర్ క్లీనర్‌తో కలిసి కోళ్ల వ్యాన్‌తో వెళ్తుండగా కోసంగిపురం-మొగిలిపాడు గ్రామాల మధ్య కటక్ నుంచి విశాఖపట్నం వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ సుశాంత్ నాయక్ (35) క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మరణించాడు. కోళ్లవ్యాన్ డ్రైవర్, క్లీనర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాశీబుగ్గ ఎస్ఐ చంద్రశేఖరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ మొదలెట్టారు!

- పట్టపగలే ఒడిశాకు తరలిపోతున్న ఇసుక
- పూర్తిస్థాయిలో దృష్టి పెట్టని అధికారులు



మెళియాపుట్టి భండార్లమ్మ వీధిలో దొడ్డిదారిన ఇసుక తరలిస్తున్న దృశ్యం



మెళియాపుట్టి ఆల్ ఆంధ్రారహదారి మీదుగా ఒడిశాకు తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్లు

మెళియాపుట్టి : కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం కొంతమంది అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. నిన్నమొన్నటి వరకు ఈ అక్రమ రవాణా రాత్రివేళల్లో మాత్రమే జరిగేది. ఇప్పుడు ఏకంగా పట్టపగలే లారీల్లో దర్జాగా తరలించుకుపోతున్నారు. ముఖ్యంగా మెళియాపుట్టి మండల సరిహద్దుల్లో ఉన్న ఒడిశా గ్రామాలకు నిత్యం టన్నుల కొద్దీ ఇసుకను తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట, కొత్తూరు మండలాల నుంచి ఇసుకను పాతపట్నం మీదుగా ఆల్ ఆంధ్రా రహదారిలో మెళియాపుట్టి గ్రామ వీధుల్లో నుంచి అక్రమంగా ఈ అక్రమ రవాణా జరుగుతోంది.

కొన్ని రోజులు ఆగినా..

గతంలో ఈ అక్రమ రవాణా విషయం పత్రికల్లో రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి రూ.2000 చొప్పున అపరాధ రుసుం విధించారు. తర్వాత కొన్నిరోజులు మాత్రమే రవాణా ఆగింది. తర్వాత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఇసుక అక్రమార్కులు మళ్లీ పాత బాట పట్టారు. పట్టపగలే రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. మెళియాపుట్టి గ్రామంలోని భండార్లమ్మ వీధి గుండా ఎప్పుడు చూసినా ఇసుక లారీలు తిరుగుతునే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఒడిశాకు ఇసుక తరలిపోకుండా అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

నా దృష్టికి రాలేదు..



నెలరోజుల క్రితమే నేను బాధ్యతలు స్వీకరించాను. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఇకపై జరగకుండా చర్యలు తీసుకుంటాను.

– రాజు, వీఆర్వో, మెళియాపుట్టి

కట్టడి చేస్తాం..



ఇదివరకే మహేంద్రతనయ నదీ తీరంలో పలుమార్లు నిఘా పెట్టాం. అక్రమ రవాణా జరగకుండా మావంతు పరిశీలన చేస్తున్నాం. రెవెన్యూ అధికారులు సకాలంలో సమాచారమిస్తే తప్పకుండా అక్రమ రవాణా కట్టడి చేస్తాం.

– పిన్నింటి రమేష్‌బాబు, ఎస్ఐ, మెళియాపుట్టి

బాలికలకు ఆర్థిక సాయం



బాలికల అమ్మమ్మకు నగదు అందిస్తున్న దాతలు

నరసన్నపేట: దేవాది కాలనీలో తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు మోహిని, యోగితలకు కంబకాయ గ్రామానికి చెందిన గుజ్జిడి కృష్ణారావు దంపతులు రూ.25,500 ఆర్థిక సహాయం ఆదివారం అందించారు. బాలికల చదువు, ఇతర ఖర్చులకు వినియోగించాలని బాలికల అమ్మమ్మ సాయమ్మను కోరారు. బాలికలు ఆరు నెలల వ్యవధిలో తల్లిదండ్రులను పోగొట్టుకున్నారు. తల్లి స్వాతి కాన్సర్ వ్యాధితో, తండ్రి కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. బాలికలకు అండగా ఉంటామని వారి చదువుతో పాటు ఇతర అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తామని కృష్ణారావు దంపతులు తెలిపారు. కాగా అలాగే మోహిని, యోగితలకు కోటబొమ్మాళి కేజీబీవీలో సీట్లు వచ్చాయి. ఇప్పటి వరకు మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో చదువుతుండగా కోటబొమ్మాళి కేజీబీవీలో రెండు రోజుల క్రితం జాయిన్ అయ్యారు. గ్రామ పెద్దల కృషి తో వారికి కేజీబీవీలో సీటు వచ్చింది. కార్యక్రమంలో దాతలు సిర్నెల్లి రమణ, బొంగు సునీతలు, స్థానికులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



ఆలయం ముందు దర్శనాలకు వెళ్తున్న భక్తులు



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కేశఖండన శాలలో తలనీలాలను సమర్పించుకునేందుకు బారులు తీరారు. రావిచెట్టు, ఇంద్ర పుష్కరిణి వద్ద ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనాల మార్గాల్లో కూడా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అంతరాలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ చేసి ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలు జరిగేలా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు. పలువురు జిల్లా అధికారులు, న్యాయమూర్తులు కుటుంబాలతో సహా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు ప్రొటోకాల్ దర్శనాలు చేయించారు.

కార్మిక హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్మికుల హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు బి.వి.వి.కొండలరావు, పడాల రమణ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్ ఏఐటీయూసీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు రూపొందించడం, పనిగంటలు పెంచడం వంటివి చేస్తున్నారన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, హమాలీలందరికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సభ్యులు టి.తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు చిక్కాల గోవిందరావు, కె.అప్పలరాజు, లబ్బ రాజు, కె.వేణుగోపాల్, జి.శ్రీను, బి.అప్పలరాజు, పి.చిన్నోడు, ఎస్.లక్ష్మి, కె.భారతి, వి.స్వర్ణకుమారి, వి.లక్ష్మి, జి.సురేష్, రామకృష్ణ, దుర్గా ప్రసాద్, యస్వంత్, రసూల్, కన్నయ్య పాల్గొన్నారు.

కొండలరావు నేత్రాలు సజీవం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న వడ్డి కొండలరావు(70) అనారోగ్య కారణంగా మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుమారుడు వడ్డి పశుపతినాథ్, పిల్ల వైకుంఠరావులు శిల్లా మణికంఠ ద్వారా విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, నంది ఉమాశంకర్‌ల ద్వారా కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందచేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు సంప్రదించాలని కోరారు.

బీజేపీ జిల్లా కమిటీ నియామకం

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లాశాఖ నూతన కార్యవర్గం నియామకమైంది. ఈ మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు జాబితా వెల్లడిచేశారు. ఉపాధ్యక్షులుగా పాలవలస వైకుంఠరావు (పలాస), వెల్నుల గోవిందరావు (ఆమదాలవలస), మంగి లక్ష్మిరెడ్డి (ఇచ్ఛాపురం), లెంక అప్పలనాయుడు (ఎచ్చెర్ల), తాడెల భూపతి (పాతపట్నం), నడుపూరి లక్ష్మినారాయణ (టెక్కలి), బైరి అప్పారావు (శ్రీకాకుళం), నారాయణశెట్టి కల్పన (ఎచ్చెర్ల), ప్రధాన కార్యదర్శులుగా చింతు పాపారావు (నరసన్నపేట), పేడాడ సూరపునాయుడు (ఆమదాలవలస), కోశాధికారిగా వీకె ప్రసాద్ (ఇచ్ఛాపురం), సహాయక కార్యదర్శులుగా వి.రఘురాములు, బి.రాజేశ్వరి, కె.దమయంతి, పి.చంద్రావతి, పి.కావ్య, పి.సూర్యనారాయణ, బి.వంశీ, జె.కుమారి. జిల్లా ఐటీసెల్ కన్వీనర్‌గా రావాడ పురుషోత్తం, జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ బడే తాతారావును నియమించారు. కాగా, పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించిన సీనియర్ నాయకులను విస్మరించడం పట్ల అనేకమంది పెదవివిరుస్తున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిది రాజకీయ ప్రేరేపిత అరెస్ట్

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి. స్వరూప్



ఎం.వి.స్వరూప్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎంపీ మిథున్‌రెడ్డిని మద్యం కేసులో అక్రమంగా అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్న వ్యక్తుల్ని అరెస్ట్ చేస్తే భయపడిపోతారనుకోవడం కూటమి ప్రభుత్వ అవివేకానికి నిదర్శనమన్నారు. మద్యం కుంభకోణం మొదట రూ.50వేలు కోట్లు అన్నారని, ఆ తరువాత రూ.18వేలు కోట్లు అని చివరకు రూ.2వేలు కోట్లకు వచ్చిందన్నారు. ఉద్యోగులను భయపెట్టి స్టేట్‌మెంట్ తీసుకుంటున్నారని ఆరోపించారు. దర్యాప్తు సంస్థలు ఎటువంటి ట్రైల్స్ చేయలేదని, కేవలం ఎల్లోమీడియా, చంద్రబాబు చేస్తున్న ట్రైల్స్ మాత్రమేనన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్య తప్ప ఈ కేసులో ఎటువంటి నిజం లేదని స్పష్టం చేశారు. అక్రమ అరెస్ట్‌లతో భయపెడితే వెనక్కి తగ్గేవారు వైఎస్సార్‌సీపీలో ఎవ్వరు లేరన్న విషయాన్ని గమనించాలన్నారు.

కూటమి పాలనలో పక్కదారి పడుతున్న ఎరువులు

- వైఎస్సార్ సీపీ యువనేత తమ్మినేని చిరంజీవి నాగ్



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: ప్రభుత్వం అందించిన ఎరువులు రైతులకు అందించకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లలో స్టాక్ చేసుకుంటూ బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. ఆమదాలవలసలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి సర్కారు పాలనలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో ఖరీఫ్ సీజన్ ముందే సాగుకు అవసరమయ్యే చర్యలను తీసుకునే వారని గుర్తు చేశారు. సకాలంలో రైతు భరోసా పథకం వర్తింపజేశారని చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా నాణ్యతతో కూడిన విత్తనాలు, ఎరువులు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడా పరిస్థితులు లేవన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం ద్వారా దాడులు జరిపించడం, తప్పుడు కేసులు బనాయించి జైల్లో వేయించడం వంటి విషయాల్లో మాత్రమే ప్రభుత్వం ముందు ఉందన్నారు. సంక్షేమం అనే పదాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు.పలువురు నాయకులు వ్యక్తిగత ఇళ్లను గొడౌన్లుగా మార్చుకుంటున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ జేడీ, అధికారులు రైతులకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. చాలాచోట్ల రైతాంగం ఎరువుల కోసం ఎదురుచూపులు చూస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగానికి స్వస్తి పలికి, వాస్తవిక పాలనలోకి రావాలన్నారు.

కూటమి నేతల తీరు సరికాదు



హరికృష్ణను పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: అల్లాడ పంచాయతీ రామదాసుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగం హరికృష్ణపై స్థలం విషయంలో ఇటీవల కూటమి నాయకులు దాడిచేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆదివారం హరికృష్ణను పరామర్శించారు. అధికారం ఉందన్న అహంకారంతో కూటమి నాయకులు దాడులకు తెగబడటం మంచి పద్ధతి కాదన్నారు. పార్టీ తరఫున కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, నాయకులు కల్యాణం శ్రీనివాసరావు, వెలమల అసిరినాయుడు, తాడేల త్రినాథరావు, పి.తవిటినాయుడు, పిట్ట ప్రసాద్, మూకళ్ల రాజారావు, ఉంగటి హరి, ఉంగటి గడ్డెన్న, కొర్సు శ్రీనువాసరావు, మడ్డి నీలయ్య, మొజ్జాడ హరి, ఉంగటి శ్రీనివాసరావు పాల్గొన్నా.

ఏఎంసీ చైర్మన్ నియామకంపై జనసేన నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జనసేన కార్యకర్తలు

హిరమండలం : హిరమండలం ఏఎంసీ చైర్మన్‌గా జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మామిడి రామకృష్ణను ఎంపిక చేయడంపై అదే పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు ఆదివారం అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో మొదటినుంచి కష్టపడిన వారికి ఎంపిక చేయకుండా తర్వాత వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం తగదన్నారు. పార్టీ అధిష్టానం మరోసారి పరిశీలన చేయాలని కోరారు.

ఉత్సాహంగా స్కూల్ చెస్ ర్యాంకింగ్ పోటీలు

- రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన క్రీడాకారులు
- విజేతలకు బహుమతులు అందజేత



మొదటి ఎత్తువేసి చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఏసీఏ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, జగన్మోహనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా సాగిన రాష్ట్రస్థాయి స్కూల్ చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. శ్రీకాకుళం నగరంలోని పీఎన్‌కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 116 మంది చిన్నారులు పాల్గొన్నారు. 12 విభాగాల్లో విజేతలుగా నిలిచిన బాలబాలికలు డిసెంబర్‌లో అసోంలో జరిగే జాతీయ స్థాయి స్కూల్ ర్యాంకింగ్స్ చెస్ పోటీల్లో పాల్గొంటారని ఆలిండియా చెస్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు సనపల భీమారావు పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు టీడీపీ సీనియర్ నేత చౌదరి బాబ్జి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతకుముందు ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు మొదటి ఎత్తువేసి పోటీలను ప్రారంభించారు. శ్రీకాకుళంలో గత ఐదేళ్లగా చెస్ ఎంతగానో అభివృద్ధి చెందిందని సంతోషం వ్యక్తంచేశారు. ఈ పోటీలకు చీఫ్ ఆర్బిటార్‌గా ఫణికుమార్ వ్యవహరించారు. అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చెస్ క్రీడాకారులకు క్రౌన్ డెంటల్ క్లినిక్ తరఫున డాక్టర్ కృష్ణవేణి, సనపల వంశీధర్ ఆధ్వర్యంలో ఉచితంగా దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం కార్యదర్శి జామి రమేష్, ఏసీఏ అడ్వైజర్ కేవీవీ శర్మ, సీఎస్ఎన్ ట్రస్ట్ సభ్యులు తాండ్ర సునీల్, వైఎస్‌వీ కుమార్, గణేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అదరగొట్టిన .. అంతరకుడ్డ కుర్రాడు



- ఏషియన్ వాలీబాల్ టోర్నీలో కాంస్య పతకం సాధించిన అట్టాడ చరణ్
- థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన భారత్
- అభినందించిన వాలీబాల్ సంఘ నాయకులు, క్రీడాకారులు



అదరగొట్టేలా వాలీబాల్ సర్వీస్ చేస్తున్న అట్టాడ చరణ్

శ్రీకాకుళం న్యూకాలనీ:

పలాస మండలం అంతరకుడ్డ గ్రామానికి చెందిన వాలీబాల్ కుర్రాడు అట్టాడ చరణ్ అదరగొట్టాడు. అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన మొదటి టోర్నీలోనే జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి కాంస్య పతకం సాధించి శభాష్ అనిపించాడు. ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు థాయిలాండ్ వేదికగా ప్రతిష్టాత్మక 2వ ఏషియన్ అండర్-16(మెన్) వాలీబాల్ చాంపియన్‌షిప్ -2025 పోటీలు జరిగాయి. ఇందులో త్రుటిలో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయిన భారత జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన సిక్కోలు క్రీడాతేజం చరణ్ కాంస్య పతకం సాధించాడు. జట్టు విజయంలో కీలక భూమిక వహించిన చరణ్ ప్రతిభను జట్టు యాజమాన్యం, ఇండియన్ వాలీబాల్ ఫెడరేషన్ ప్రసంశించింది. అంతకుముందు ఈ నెల 10వ తేదీ వరకు బెంగళూరు వేదికగా ఎన్.ఎస్.ఎస్.సి. అకాడమీలో జరిగిన శిక్షణా శిబిరాల్లో మంచి క్రమశిక్షణతోపాటు అత్యుత్తమ ఆటతీరుతో సెలక్టర్లను ఆకట్టుకున్నాడు.

అంతరకుడ్డ నుంచి అంతర్జాతీయ పోటీలకు..

చరణ్ తల్లిదండ్రులు అట్టాడ కమల్‌నాదమ్, దేవి. వీరిది వ్యవసాయ కుటుంబం. చరణ్ విశాఖపట్నంలోని అక్కయ్యపాలెంలో ఉన్న సాయ్ స్పోర్ట్స్ స్కూల్/హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి పూర్తిచేశాడు. ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందనున్నాడు. అన్నయ్య భార్గవ్ ఇంజనీరింగ్ ఫస్టియర్ చదువుతున్నాడు. మావయ్య రవి ప్రేరణ.. కోచ్ సత్యనారాయణ ప్రోత్సాహంతో రాణించగలుగుతున్నానని చెబుతున్నాడు. 2025లో ఢిల్లీలో జరిగిన సీబీఎస్సీ నేషనల్స్ వాలీబాల్ స్కూల్‌గేమ్స్‌లో కాంస్య పతకం సాధించగా, గత ఏడాది 2024లో జార్ఖండ్‌లో జరిగిన సీబీఎస్సీ నేషనల్స్‌లో ప్రాతినిధ్యం వహించి సత్తాచాటాడు.

అభినందనల వెల్లువ..

సిక్కోలు నుంచి ఏషియన్ వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా కాంస్య పతకం సాధించడం పట్ల క్రీడావర్గాల్లో సర్వాత్రా హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ప్రత్యేకంగా మెచ్చుకున్నారు.వాలీబాల్ జిల్లా కార్యదర్శి కె.రామచంద్రుడు, ఉపాధ్యక్షులు వై.పోలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్వీ రమణ, టి.రవి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, బి.సతీష్, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, కోచ్ కె.హరికృష్ణ, వాలీబాల్ సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

సంతోషంగా ఉంది..

అంతర్జాతీయ ఏషియన్ వాలీబాల్ మీట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా ఉంది. అందులోను మెడల్ సాధించడం సంతోషంగా ఉంది. సీనియర్ నేషనల్స్ ఆడి దేశానికి రిప్రజెంట్ చేయాలనేది నా కళ. ఇందుకు అహర్నిశలు కృషి చేస్తా.

– అట్టాడ చరణ్, వాలీబాల్ క్రీడాకారుడు